పెద్ద కథ:

# జానకి పెళ్ళి?

వల్లంపాటి వెంకట సుబ్బయ్య



(గత సంచిక తరువాయి)

ఒళ్ళు తెలియని కోపంలో నడుస్తున్న రాజేశ్వరమ్మకు తాను నడుస్తున్న సంగతే స్పురణకు రాలేదు. దాదాపు ఫర్లాంగు దూరం నడిచాక ఆమెకు తెలిసిన ఒక రిక్షా అబ్బాయి ఎదురై—

"రిక్షా కావాలామ్మా?" అని అడిగాడు.

తాను ఎర్రటి ఎండలో నడుస్తున్నట్టు అప్పుడు జ్ఞాపకం వచ్చింది రాజేశ్వరమ్మకు.

రిక్షా ఎక్కి కూర్చొని, "కాలనీకి పద" అన్నది.

వల్లని నిప్పులు పరచినట్లున్న తారు రోడ్డుమీద రిక్షా మెల్లగా పోతోంది. తారు రోడ్డుమీద సెగలు లేచినట్టు, రాజేశ్వరమ్మ మనసులో పొగలు లేస్తున్నాయి సరస్వతమ్మతో తాను మాట్లాడిన పద్ధతి సరైనదో, కాదో ఎంత ఆలోచించినా ఆమెకు అర్థం కాలేదు. తానెప్పుడూ— ముఖ్యంగా సరస్వతమ్మ విషయంలో- ఆవేశపడి ఎరుగదు. జానకిని ఏ నిముషంలో లాక్కుపోతుందో అన్న భయం తన్ను పిండేస్తున్నా. తనకు మాతృత్వవాంఛ బహిర్గతం కావటానికి దారిచూపిన దేవతగానే సరస్వతమ్మను యిన్నాళ్ళూ భావించింది. ఈనాడు జానకి పెళ్ళి తమ యిద్దరిమధ్య యిన్ని సంవత్సరాలుగావున్న మమతను తుంచివేసే విషమ సమస్యగా తయారు కావటం రాజేశ్వరమ్మకు నచ్చలేదు....

"ఇరవై సంవత్సరాలు తన కూతురు నా యింట్లో పెరగటానికి ఒప్పుకున్న సరస్వతమ్మ, ఈనాడు తాను చెయ్యదలుచుకున్న పెళ్ళికి ఎందు కొప్పుకో కూడదు?" తన్ను తాను ప్రశ్నించుకుంది రాజేశ్వరమ్మ

"ఇరవై సంవత్సరాలు తను కన్నబిడ్డను నీ కప్పగించిందికదా! కనీసం యిప్పుడు సరస్వతమ్మ అభిప్రాయాన్ని నువ్వెందుకు గౌరవించ కూడదు?" తన లోంచి రాజేశ్వరమ్మను ఎవరో ప్రశ్నించారు.

నిప్పును తొక్కినట్టు అదిరిపడింది రాజేశ్వరమ్మ.

"అదెలా సాధ్యం?"

"ఇరవై సంవత్సరాలు సరస్వతమ్మకు సాధ్యమైనప్పుడు నీ కెందుకు కాదు?"

రాజేశ్వరమ్మ జవాబు కోసం వెదుక్కుంది. స్పురించకపోయేసరికి కోపం వచ్చింది.

రిక్షా ఆగింది. కానీ రాజేశ్వరమ్మ గమనించలేదు.

"దిగండమ్మా." అన్నాడు రిక్షా అబ్బాయి.

తన పరధ్యానం తనకే సిగ్గనిపించింది రాజేశ్వరమ్మకు.

సోఫాలో పడుకుని పత్రిక చదువుకుంటున్న చౌదరి, లోపలికొస్తున్న భార్యను చూసి, చిరునవ్వుతో ఆహ్వానించబోయి, మానేసి లేచి కూర్చున్నాడు.

రాజేశ్వరమ్మ లోపలకొచ్చి, ముఖం ముడుచుకొని, భర్త ప్రక్కనే కూర్చుంది.

భార్య వాలకాన్ని చూసిన చౌదరికి వెన్నె ముక గుండా భయం జివ్వున పాకింది.

"ఏం జరిగింది రాజీ?" అన్నాడు చౌదరి, భార్య భుజం మీద చేయి వేస్తూ.

భర్త స్పర్శ వర్షించటానికి సిద్ధంగావున్న మేఘానికి చల్లగాలిలా తాకింది.

చౌదరి భుజంమీద పడి గొల్లుమంది రాజేశ్వరమ్మ.

ఐదు నిమిషాలపాటు ఎంత ప్రయత్నించినా చౌదరి భార్య ఏడ్పును ఆపలేకపోయాడు రాజేశ్వరమ్మ కూడా చాలా కష్టంమీద తన్నుతాను సంబాళించుకుంది. అలసిపోయిన పాపాయిలా భర్త భుజంమీద వాలిపోయింది.

"చెప్పు రాజీ - ఏం జరిగింది? చెప్పా చెయ్యకుండా అలా నన్ను భయపెట్టేస్తే ఎలా." అనునయంగా అన్నాడు చౌదరి

"ఏమండీ. జానకికి ఎలాగైనా నచ్చచెప్పి సరస్వతమ్మగారింటికి పంపేదామండీ" అన్నది రాజేశ్వరమ్మ కాస్త తలపైకెత్తి భర్త ముఖంలోకి భయంగా చూస్తూ.

తనకు తెలియకుండానే డిగ్గున లేచాడు చౌదరి. రాజేశ్వరమ్మకు ఎద ఝల్లుమంది. చౌదరి నాలుగంగలువేసి. కిటికీ వద్దకు వెళ్ళి వీధిలోకి చూస్తూ ఒక నిమిషం నిలబడ్డాడు. దడదడలాడుతున్న గుండెను చిక్కబట్టుకోవాలని ప్రయత్నంచేస్తూ అలాగే సోఫామీద కూర్చుంది రాజేశ్వరమ్మ.

"యీ ట్లాడుతోంది నువ్వేకదా?" అన్నాడు చౌదరి తల తిప్పుతూ. ఏమనాలో తెలియని రాజేశ్వరమ్మ తల వూపింది.

"అలాగా- నిలోకేదో దయ్యం దూరిందనుకున్నాను."

"సరస్వతమ్మగారు బ్రాహ్మలకు తప్ప జానకిని యివ్వకూడదన్నారండి. అందుకని...."

"ఆ మాట నీతో అన్నదా ఆమె?"

"ఔను"

"ఎప్పుడు?" రెట్టించాడు చౌదరి.

"ఇ....ఇప్పుడే"

"ఎందుకట?"

"ఏమోనండి." అన్నది రాజేశ్వరమ్మ భర్త ప్రశ్నకు ఆశ్చర్యపోతూ.

"నువ్వడగలేదూ?"

"అడిగానండి"

"ఏమని అడిగావు?"

"ఇంతకాలం మేం పెంచాంగదా! మీ కులం అప్పుడేమైంది? ఇప్పుడు మా వాళ్ళలో జానకినిస్తే తప్పేమిటి అని అడిగానండీ"


"అందుకు సరస్వతమ్మ ఏమంది?"

"ఏమీ అనలేదండి."

"పోనీ నువ్వే మన్నావు."

"నేనూ ఏమీ చెప్పలేదండి."

"నేను చెబుతున్నాను విను. జానకిని



మన వాళ్ళలోనే యిచ్చి చెయ్యాలి నేను బ్రతికుండగా జానకి పెళ్ళి జరిగితే యిలాగే జరుగుతుంది. అంతే." ఖచ్చితంగా అన్నాడు చౌదరి

రాజేశ్వరమ్మ ఆశ్చర్యపోయింది.

"ఇదేమిటండి యిలా మారిపోయారు? ఇన్నాళ్ళూ నన్ను తప్పులు పట్టేవాళ్ళు ... యిప్పుడు మీరే .

"మరి మాట్లాడకు.అది అంతే!" మళ్ళీ అన్నాడు చౌదరి.

"ఎందుకూ?" ఏడుపు మర్చిపోయిన రాజేశ్వరమ్మ చిరునవ్వుతో ప్రశ్నించింది

"సరస్వతమ్మకు అంత పట్టింపుంటే నాకెందుగుండకూడదూ?"

"ఆమె కన్నతల్లండీ - ఆమెకు పట్టింపుండవచ్చు మీకుండటానికి వీల్లేదు.

"ఆ మాట సరస్వతమ్మ నిన్నంటే సహిస్తావా?" ప్రశ్నించాడు చౌదరి

"సహించననుకోండి." సందేహిస్తూ అన్నది రాజేశ్వరమ్మ

"చూడు రాజీ. సరస్వతమ్మ ఎంత కాదు వాదదన్నా జానకిని మనవాళ్ళలో యిచ్చి పెళ్ళి చేయటం ఖాయం "

"ఏమిటంత నమ్మకంగా చెబుతున్నారు?"

"ఇరవై సంవత్సరాలు శూద్రుల యింట్లో పెరిగిన అమ్మాయిని పెళ్ళి చేసుకోవటానికి ఏ బ్రాహ్మడు ముందుకొస్తాడు " నవ్వాడు చౌదరి.

"ఏమో! ఎవరైనా ముందుకొస్తారేమో? ఒకవేళ సరస్వతమ్మగారి తమ్ముడే ఒప్పుకుంటే!"

"అది కల్లోని మాట! మరో శాఖకు చెందిన సాటి బ్రాహ్మణ్ణి సమానంగా చూడలేని బ్రాహ్మలు, మన యింట్లో పెరిగిన పిల్లను చేసుకుంటారంటావా? నేను నమ్మను "

"అలా అనకండి, మన ప్రక్క వీధిలో వెంకటశాస్త్రిగారి కొడుకు రెడ్ల అమ్మాయిని రిజిష్టరు పెళ్ళి చేసుకోలేదూ? ఏమో నబ్బా, మీకున్నంత నమ్మకం నాకులేదు."

చౌదరికి యింతసేపూ వున్న నమ్మకం క్షణంలో పోయింది.

"అంతేనంటావా?" బలహీనంగా ప్రశ్నించాడు చౌదరి

"ఏమో !"

"అలాగైతే తక్షణం గుంటూరు సంబంధం ఖాయం చేసేస్తాను."

"అంత తొందరెందుకండీ మంచి చెడ్డలు బాగా ఆలోచించి చూద్దాం "

"అది నీకనవసరం. నువ్వు నోరు మూసుకో." కసురుకున్నాడు చౌదరి. రాజేశ్వరమ్మ పెదవులమీద యింతదాకా వెలుగుతున్న చిరునవ్వు గాలికి దీపంలా ఆరిపోయింది.

* *

ఉదయం తొమ్మిదిగంటలు దాటకముందే ఎండ నిప్పులు చెరుగుతోంది గాలి పారాడని యింట్లో ఎండ బాధ యిబ్బడి ముబ్బడిగా వుంది.

ఎండకంటే తీవ్రంగా వున్న భార్య కోపాన్ని భరించలేని రామశర్మ నిస్పృహాయంగా నులక మంచంమీద కూర్చొని వున్నాడు.

"అంతేనంటావా?" అన్నాడు పూర్తిగా విసిగిపోయిన రామశర్మ

"అంతే ... అంతే .... అంతే" కస్సుమన్నది సరస్వతమ్మ.

"అసలు జానకి పెళ్ళి మనం చెయ్యగలమంటావా?" మళ్ళీ ప్రశ్నించాడు రామశర్మ.

"ఎందుకు చెయ్యలేం?"

"అందుకు రెండు కారణా లున్నాయి.

సంప్రదాయ మాధురి

## మందార మకరందాలు

శ్లో॥ జ్ఞానం ప్రధానం నతు కర్మహీనం।
కర్మ ప్రధానం నతు బుద్ధి హీనం।
తస్మా దుభాభ్యాంతు భవే త్ప్రసిద్ధిః।
నహ్యేకపక్షో విహగః ప్రయాతి॥

జ్ఞానం ప్రధానమేకాని, కర్మహీనమైన జ్ఞానంవల్ల లాభంలేదు. కర్మ ముఖ్యమైనదే కాని, జ్ఞాన హీనమైన కర్మవల్ల కూడా ప్రయోజనంలేదు జ్ఞాన, కర్మల రెంటినీ కలుపుకుంటేనే జీవించడం సాధ్యమవుతుంది. ఒక్క రెక్కతో పక్షి ఎగురలేదుకదా!

జానకికి పెళ్ళి చెయ్యగలిగిన ఆర్థికస్తోమత మనకు లేదు రెండవది ఇరవై సంవత్సరాలు కమ్మవాళ్ళు పెంచిన పిల్లను ఏ బ్రాహ్మడూ చేసుకోడు "

"ఎందుకు చేసుకోడూ? కమ్మవాళ్ళు పెంచినంత మాత్రాన జానకికి కులం పోయిందా?"

"ఎందుకు పోలేదూ?"

"ఎలా పోతుందండీ? జానకి మన కూతురు కాదుటండీ?" విసుగ్గా అన్నది సరస్వతమ్మ.

"అలా పోవన్న నమ్మకం నీకుంటే, చౌదరి వాళ్ళింట్లో నువ్వు మంచి నీళ్ళు కూడా ఎందుకు ముట్టవు?"

"అది నాయిష్టం నాకిష్టంలేను. అందువల్ల వాళ్ళింటో నేనేమి తినను."

"అలాగే ఎవరిష్టాయిష్టాలు వారికుంటాయి. జానకి యిరవై సంవత్సరాలు వాళ్ళ యింట్లో పెరిగింది కాబట్టి దాన్ని పెళ్ళాడటానికి ఎవరికీ యిష్టంలేక పోవచ్చు."

"ఎవరికిష్టంవున్నా లేకపోయినా, నా తమ్ముడు తప్పకుండా ఒప్పుకుంటాడు." స్థిరనిశ్చయంగా అన్నది సరస్వతమ్మ.

"అదికూడా చూద్దాం." మంచం మీద నుంచి లేస్తూ అన్నా - రామశర్మ.

సరస్వతమ్మ కూడా లోపలికి పోటో యింది.

"ఈ రోజే ఉత్తరం రాయమన్నావా?" ప్రశ్నించాడు రామశర్మ

"మీరేం రాయనవసరంలేదు నేనే రాసాను."

"ఈ రోజు మంగళవారం."

"మరేం ఫరవాలేదు."

* * *

"ఈ రోజు ఏం వారం?" ప్రశ్నించింది జానకి

"మంగళవారం. నిలయంలో సమయం సరిగ్గా ఏడుగంటలు." అన్నాడు ఎదురుగా కూర్చున్న శ్రీధర్ రెడ్డి.

జానకి మృదువుగా నవ్వింది.

పొదర్లలో ఒకమూల, వెలుగుకు దూరంగా, చిరుమువ్వలా మోగిన ఆ నవ్వు శ్రీధర్‌కు తప్ప మరెవరికీ వినిపించదు

దూరంగా వున్న ఫోకో సెంచ దీపపు కాంతి పల్చగా శ్రీధర్ ముఖం మీద పడుతోంది. ఆ కాంతిలో నీలంగా కని పిస్తున్న శ్రీధర్ కళ్ళను చూస్తూ ప్రశ్నించింది జానకి—

"గుంటూరికి ఉత్తరం రాశావా?"

"ఈ రోజే రాశాను." అన్నాడు శ్రీధర్.

"ఏమని రాశావు?"

"ఏం రాస్తే నీకేం?"

జానకి నవ్వింది

"ఇలాంటి మాటలు చెప్పి చెప్పి నన్ను బుట్టలో వేసుకున్నావు." అన్నది నవ్వుతూ జానకి.

"నావద్ద వున్నది ఒకే ఒక బుట్ట. అందులోకి నాకు తెలియకుండా నువ్వే దూరావు "

"అసలు మీ ప్రేమకూ మా ప్రేమకూ భేదం ఏమిటో తెలుసా?"

"నాకు తెలీదు నువ్వు తో నేపరకూ నేను ప్రేమలో పడ్డట్టు నాకే తెలీదు." అన్నాడు శ్రీధర్.

"ఆడవాళ్ళు చెవుల్తోనూ, మొగవాళ్ళు కళ్ళతోనూ ప్రేమిస్తారట " నవ్వుతూ అన్నది జానకి.

"ట—అంటున్నావు. ఎవరామాట న్నది?"

"ఎవరో మహాకవై వుంటాడు."

"కాదు నేనే ఎప్పుడో యితర మొగ వాళ్ళను, నీలాంటి ఆడవాళ్ళను ఉద్దేశించి అని వుంటాను "

"ఏం నువ్వు మాత్రం కళ్ళతో ప్రేమించవా?"

"కళ్ళతో మాత్రమే ప్రేమించేవాడు వుండడు. కళ్ళు చాలా చెడ్డవి. వాటి కెప్పుడూ తృప్తి వుండదు కళ్ళతో మాత్రమే ప్రేమించేవాడు అసమర్థుడైన కాముకుడు, ప్రేమికుడుకాడు."

మళ్ళీ నవ్వింది జానకి.

"ఏ సంగతేమో నాకు తెలీదు. నా ప్రేమ మాత్రం చెవుల్తోనే ప్రారంభమైంది."

"అక్కడే ఆగిపోకుండా చూచుకో" అన్నాడు శ్రీధర్.

జానకి లేచి నిలబడింది. శ్రీధర్ జాన


గుప్తరోగములకు చికిత్స

ఏ కారణము చేతనైనా మీ యువకత్వం మరియు శక్తి కోల్పోయినట్లు మీరు బాధ పడుతున్నట్లతే మా "ప్రత్యేక ధాతు పాస్టిక్ చూర్ణ" వాడండి దీనిని వాడి నందున రాత్రి స్ఖలనము, శీఘ్ర స్ఖలనము, వీర్యము పలుచగా పడుట మరియు బలహీనమైన వీర్యము, మూత్రముతో వీర్యము పడుట లేదా ఏదేని లోపములు నయం చేస్తుంది. ధర రు. 15/- పూర్తి కోర్సు రు. 40/- పోస్టేజీ అదనం. పని చేయనట్లు ఋజువైతే ధర వాపసు.

BASANT CHIKITSALAYA(D.P)
P.o Maira Barith (Patna) 805 105

SEALED PACKING 10 & 14 TABLETS
AVAILABLE AT ALL CHEMISTS

Mfrs: SHENU & CO. MADRAS-21

కిని దగ్గరకు తీసుకొని మృదువుగా వెచ్చగా వున్న పెదవులమీద ముద్దు పెట్టుకున్నాడు.

జానకి గొంతులో అస్పష్టమైన ఆనందం కువకువ లాడింది గుడ్డి వెలుగులు చూచి భయపడ్డట్లున్న చెట్లు నిశ్చలంగా నిలబడి వున్నాయి నేల వెచ్చగా నిట్టూరుస్తూ వాన కోసం ఎదురు చూస్తోంది

"వెడదామా?" అన్నాడు శ్రీధర్.

జానకి శ్రీధర్ వెంట నడిచింది.

పార్కు గేటువరకూ వచ్చి చెరో రిక్షా ఎక్కారు

రెండు రిక్షాలూ చెరోవైపుకు నడిచాయి

"ఈ రోజు మంగళవారం", అనుకుంది జానకి.

చెదరిపోయిన చీమల పుట్టలా వున్న జనం మధ్య చోటు చేసుకుంటూ రిక్షాలు ముందుకు సాగాయి.

* * *

"ఈ రోజే బయల్దేరుతాను', అన్నది సరస్వతమ్మ

"అలా ... కాస్త ముందు వెనుకలు ఆలోచించు' అన్నాడు రామశర్మ.

"ఆలోచించటానికేమున్నాయి!" నేరుగా వెళ్ళి 'ఒరే తమ్ముడూ! నా కూతుర్ని పెళ్ళిచేసుకో' అని అడుగుతాను. వాడు సరేనంటాడు."

"కాదంటే?"

"ఎందుకంటాడండీ? వాడు నా తమ్ముడు - చిన్నాన్న కొడుకే నను కోండి."

భార్య అమాయకత్వాన్ని చూసి రామశర్మకు బాధ కలిగింది.

"చూడు సరస్వతీ - మీ తమ్ముడు తప్పకుండా ఒప్పుకుంటాడంటావా?" నెమ్మదిగా మళ్ళీ ప్రశ్నించాడు రామశర్మ.

"తప్పకుండా ఒప్పుకుంటాడు నేనంటే వాడికి, మా చిన్నాన్నకి చచ్చేంత అభిమానం."

"ఇలా అంటున్నందుకు బాధ పడొద్దు నువ్వింత కాలం జబ్బుతో పడి వుంటే ఒక్కసారైనా చూట్టానికి రాలేదేం వాళ్ళెవరూ!" భార్య భుజంమీద చెయి వేస్తూ అన్నాడు రామశర్మ.

సరస్వతమ్మ వలలో చిక్కుకున్న కుందేలులా అటు యిటు చూచింది.

"వీలు కాలేదేమో! ఎవరి బాధలు వాళ్ళకుంటాయి" కాస్త విసుగ్గా అన్నది సరస్వతమ్మ

"ఇన్ని సంవత్సరాలూనా?"

"అవన్నీ యిప్పుడెందుకు? నేను జబ్బుతో వున్నప్పుడు నన్ను చూట్టానికి

ఆంధ్రజ్యోతి పాఠకులకు
మూడు వారాల
మరో చక్కని ప్రేమకథ
## 'గూడు కోసం'
వర్ధమాన రచయిత్రి
శ్రీమతి డి. విజయలక్ష్మి
రచన
త్వరలో ప్రారంభం!

వాళ్ళు ఎందుకు రాలేదని అడగటానికి పోవటంలేదు నా కూతుర్ని పెళ్ళి చేసుకోమని అడగటానికి వెళ్తున్నాను"

రామశర్మకు జాలితో కూడిన చిరునవ్వు వచ్చింది.

"కాస్త కూర్చో - చివరిసారిగా నీకో మాట చెప్పాలి" అన్నాడు రామశర్మ

"ఆ శూద్రుణ్ణి నా కూతురు పెళ్ళాడడానికి ఒప్పుకోమనేగా? నా ప్రాణం పోయినా అందుకు ఒప్పుకోను" సరస్వతమ్మ కళ్ళు పిచ్చి ఆవేశంతో మెరిశాయి.

"ఎందుకు?" ప్రశ్నించాడు రామశర్మ.

"ఎందుకంటే మనం బ్రాహ్మలం మన వంశంలో కులం తప్పి యింతవరకూ ఎవరూ పెళ్ళిచేసుకోలేదు"

"మన వంశంలో యింతవరకూ యిరవై సంవత్సరాలు శూద్రుల యింట్లో పెరిగిన పిల్లలెవరైనా వున్నారా?"

"ఏం బుద్ధిలేదండీ మీకు - పెరగటమూ పెళ్ళి చేసుకోవటమూ రెండూ ఒకటేనా!" ఆశ్చర్యపోయింది సరస్వతమ్మ.

"ఏమిటి భేదం?"

"నా పాడె! నా చావు! నా శ్రాద్ధం!" సరస్వతమ్మ ఎదుటవున్న గోడకేసి తల బాదుకోవటం ప్రారంభించింది.

రామశర్మకు గుండె నిలిచిపోయినట్లనిపించింది

భార్య భుజాలు పట్టుకొని తనవైపు లాక్కుంటూ—

"ఏమిటి సరస్వతీ ఈ ఆవేశం?" అన్నాడు.

"ఆవేశంకాదు. నా కడుపుమంట ఇదో. చివరిసారిగా చెబుతున్నాను. ఇంకోసారి జానకి పెళ్ళి విషయంలో ఆ సంబంధం మాటెత్తారో - బావిలో దూకేస్తాను." ఎముకల గూడుమీద చర్మం కప్పినట్టున్న సరస్వతమ్మ శరీరం ఆవేశంతో వూగిపోయింది.

(ఇంకా వుంది)

